## క్లుప్తంగా

### అవకతవకలపై విచారణ చేపట్టాలి

**అశ్వాపురం:** మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 2020–2023 సంవత్సరాల కాలంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పాలకవర్గం వచ్చినప్పటి నుండి సకాలంలో ఆడిట్ చేయకుండా కాలయాపన చేస్తూ నగదు బ్యాలెన్స్ తగ్గించే ప్రయత్నంలో అధికారులు, పాలకవర్గం కలిసి అవకతవకలకు పాల్పడ్డారన్నారు. జిల్లా సహకార అధికారి ఇచ్చిన నివేదికలో రూ.20 లక్షలు నిధులు దుర్వినియోగం జరిగినట్టు గుర్తించారని ఇవి కాకుండా ఇంకా రూ.20 లక్షలకు అదనపు బిల్లులు, ఫేక్ బిల్లులు పెట్టారని ఆరోపించారు. 20 లక్షల నిధుల దుర్వినియోగంలో సీఈఓను బాధ్యుడిని చేశారని, కానీ గతంలో అధ్యక్షుడిని కలిపి బాధ్యుడిని చేశారన్నారు. ఇప్పుడు జరిగిన అవకతవకలపై అధ్యక్షుడిని ఎందుకు బాధ్యుడ్ని చేయలేదని ప్రశ్నించారు. దీనిపై సంఘం సభ్యులు, రైతులు సత్వరమే సమావేశమై సంఘంలో జరిగిన అవకతవకలపై చర్చించి సంఘాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 51 ఎంక్వైరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొని స్వాహా అయిన నిధులు రాబట్టాలన్నారు.

### పరిహారం ఇప్పించాలని వినతి

**బూర్గంపాడు:** ఇరవెండి, కోయగూడెం గ్రామాలకు చెందిన వ్యవసాయ భూముల్లో నుంచి ఐటీసీ పీఎస్‌పీడీ గోదావరి నీళ్ల కోసం పైప్‌లైన్ వేస్తున్నందున తమకు నష్టపరిహారం ఇప్పించాలని భూనిర్వాసిత రైతులు కోరారు. శుక్రవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావును కలిసి వినతిపత్రం అందించారు. వారి భూముల నుంచి పైప్‌లైన్ వేసేందుకు ఐటీసీ అధికారులు సర్వే నిర్వహించారని, అయితే పరిహారమిచ్చేందుకు మాత్రం వారు విముఖంగా ఉన్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఐటీసీ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

### జూదమాడితే చర్యలు

**చంద్రుగొండ:** పండగ ముసుగులో జూదమాడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా కోడిపందాలు, కోసాట, పేకాట ఆడేవారిపై నిర్వాహకులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

**అన్నపురెడ్డిపల్లి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై విజయ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండ పటిష్ట భద్రత చర్యలు చేపట్టామని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

### రగ్గుల పంపిణీ

**భద్రాచలంటౌన్:** పట్టణానికి చెందిన శ్రీరాములు, సునీల్, సుధాకర్‌లు సంయుక్తంగా పట్టణంలోని దివ్యాంగులకు, వృద్ధులకు రగ్గులను శుక్రవారం అందజేశారు. అలాగే క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సాకేత్, కార్తీకేయ, ప్రకాష్, వసుంధర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు సైకిళ్లు..

**బూర్గంపాడు:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు తానా ఫౌండేషన్, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్లను పంపిణీ చేశారు. మండలంలోని ఇరవెండి గ్రామంలో శుక్రవారం తాళ్లూరి ట్రస్ట్ వ్యవస్థాపకులు తాళ్లూరి పంచాక్షరయ్య చేతుల మీదుగా ఆరుగురు విద్యార్థినిలకు సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా తానా అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటరమణ, ట్రస్టీలు సామినేని రవి, తాళ్లూరి జయశేఖర్‌ల సహకారంతో ఇప్పటి వరకు అనేక గ్రామాలలో 500 సైకిళ్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ అడ్మిన్‌స్ట్రేటివ్ మేనేజర్ చెంగలరావు, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచ్ కొర్సా లక్ష్మీ, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, తహసీల్దార్ కార్యాలయ యూడీసీ కీర్తి పాల్గొన్నారు.

### నివాళి..

**దమ్మపేట:** సీపీఐ నాయకుడు ఉడతనేని పుల్లారావు వర్ధంతి సందర్భంగా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో ఉడతనేని పుల్లారావు స్మారక స్థూపం వద్ద సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘంలో 15 సంవత్సరాలు పనిచేసి, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో పోరాటాలు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూకలకుంట సత్యనారాయణ, సుంకుపాక ధర్మ, బత్తుల సాయి, దొంగ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందడి



- పల్లెల్లో మొదలైన పండుగ వాతావరణం
- సెలవులతో సొంతూళ్లకు..
- ఏ ఇంట చూసినా పిండి వంటల ఘుమఘుమలు
- నేడు భోగి





చంద్రుగొండ: పిండివంటలు చేస్తున్న మహిళలు

**దుమ్ముగూడెం:** హరిదాసుల సంకీర్తన, గంగిరెద్దుల ఆటలు, సన్నాయి మేళాల నడుమ పల్లెలు కళకళలాడుతూ సంక్రాంతి శోభ వచ్చింది. గ్రామాలను వదిలి జీవనోపాధి, ఉన్నత చదువులకు సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు సంక్రాంతికి వారి ఊర్లకు తరలివచ్చారు. నూతనంగా వివాహం చేసుకున్న దంపతులు కొత్త అల్లుళ్ల రాకతో సందడి నెలకొంది. సంక్రాంతి సందర్భంగా ఘుమఘుమలాడే పిండి వంటలు, ఇంటి ముందు వేసే రంగువల్లులు కొత్త ఆనందాన్ని తెస్తున్నాయి. ఏ పండుగకు లేని విధంగా ఇంటి ముందుకు వచ్చే గొబ్బెమ్మలతో సంతోషం సంతరించుకుంటోంది. శనివారం(నేడు) భోగి మంటలతో ప్రారంభమై ఆనందాల నడుమ ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం గోమాత పూజలతో కనుమ పండుగతో ప్రతి ఒక్కరూ పండుగ సంబరాలను చేసుకోనున్నారు.

**కిటకిటలాడిన దుకాణాలు..**

సంక్రాంతి పండుగకు ప్రతి ఒక్కరూ నూతన వస్త్రాలు కొనుగోలు చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రధాన గ్రామం లక్ష్మీనగరంలో వస్త్ర దుకాణాలలో కొనుగోలు దారులతో వారం రోజుల నుంచి కిటకిటలాడుతున్నాయి. మండలంలోని ప్రజలు అందరూ ఎక్కువగా లక్ష్మీనగరం గ్రామంలోని దుకాణాల్లో పండుగ సామాన్లు కొనుగోలు చేస్తుండటంతో వస్త్ర దుకాణాలు, పండ్లు, చెప్పులు, కిరాణా దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతుండటంతో ప్రధాన గ్రామాల్లో సందడి కనిపిస్తోంది.

**గ్రామాల్లో సందడి..**

సంక్రాంతి పండుగకు సెలవులు ఇవ్వడంతో ఎక్కడెక్కడో చదువుకునే విద్యార్థులు, పట్టణాల్లో ఉద్యోగాలు చేసే వారు కుటుంబసమేతంగా గ్రామాలకు తరలిరావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. నిత్యం పనుల్లో బిజీగా ఉండే ప్రజలు ఈ మూడు రోజుల పాటు సంక్రాంతికి ఇంటికి వచ్చే వారి కోసం పిండివంటలు చేసి వారికి ఇష్టమైన వంటకాలను చేసి సంతృప్తి చెందుతారు. కుర్రకారు, నడివయస్కులు సరదా కోసం గ్రామాల్లో నిర్వహించే క్రీడా పోటీలలో పాల్గొంటూ సందడి చేస్తారు.

**నేడు భోగభాగ్యాల భోగి..**

మూడు రోజుల పండుగలో మొదటిగా భోగభాగ్యాలను ఇచ్చే భోగి నేడు జరుపుకోనున్నారు. ఈ రోజు(శనివారం) అందరూ భోగి మంటలతో ఉల్లాసంగా గడుపుతారు. అందరూ ఉదయాన్నే లేచి ఎముకలు కొరికే చలిని తరిమేయడానికి పాత వస్తువులను అన్నీ సమకూర్చి కొత్త వాటితో నిత్య నూతన జీవితం ఆరంభించడానికి గుర్తుగా వాటిని భోగి మంటల్లో పెడుతూ చల్లని చలిలో వెచ్చదనాన్ని ఆస్వాదిస్తారు. ఇక సాయంత్రం వేళ బొమ్మల కొలువులతో చాలా ఇళ్లల్లో చిన్నపిల్లలు తమ దగ్గర ఉన్న వివిధ రకాల ఆట వస్తువులను ప్రదర్శిస్తూ ఆనందంగా ఉల్లాసంగా ఆడుతూ పాడుతూ గడుపుతారు. ఇక భోగిపళ్ల పేరంటాలైతే అందరూ సమావేశమై రేగిపళ్లు శనగలు పూలు చెరుకుగడలు కొన్ని నాణెలను కొత్త దుస్తులు వేసుకున్న పిల్లలపై ఆశీర్వాదం సూచికగా కుమ్మరించి దిష్టి తొలగిస్తారు.

**రేపు పెద్దపండుగ..**

ఇక ఆదివారం పెద్ద పండుగ మకర సంక్రాంతి జరుపుకోనున్నారు. పంట చేతికొచ్చిన ఆనందంలో రైతన్నల కళ్లల్లో విరిసే కోటి కాంతులతో ఆనందాల కోలాహాలంతో ఈ పండుగను మూడు రోజులు చేసుకోవడం ఆనవాయితీ.

**జంతుపూజల కనుమ..**

సంక్రాంతి పండుగలో మూడోదైన కనుమను సోమవారం నిర్వహించనున్నారు. వాస్తవానికి కనుము కూడ చాలా విశిష్టమైంది కానీ కాలక్రమంలో దీని అర్థం మారిపోయింది. జంతువులను వధించడం. మాంసాహారం తినడమే ప్రధానంగా మారింది. కానీ వాస్తవంగా కనుమ పండుగ విశిష్టత అది కాదు రైతుకు వెన్నంటే ఉండి దుక్కి దున్ని పంటలు పండటానికి దోహదం చేసే ఎద్దులు పాలిచ్చిన ఆవులు కాపలాగా ఉండే జంతువులు ఇతర పశుపక్షాదులను పూజించే పండగే కనుమ. ఎద్దుల కొమ్ములకు రంగులు వేయడం అందంగా అలంకరించడం ఈ రోజు చేస్తారు.

## ప్రభుత్వ తీరుకు నిరసనగా భిక్షాటన



భిక్షాటన చేస్తున్న నాయకులు, కార్మికులు

**భద్రాచలంటౌన్:** గిరిజన వసతి గృహాలలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికుల వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాచారి మాట్లాడుతూ... పండుగ పూట కార్మికులను ప్రభుత్వం పస్తులుంచుతుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే కార్మికుల వేతనాలు చెల్లించాలని, సమస్యలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హిరాలాల్, నాగమణి, లక్ష్మీ, భద్రమ్మ, శ్రీను, రాములు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై

**దుమ్ముగూడెం:** క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని కలుగజేస్తాయని, దేహదారుఢ్యం పెరుగుతుందని ఎస్సై రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అచ్చితాపురం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చర్ల, దుమ్ముగూడెం రెండు మండలాల మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో పాటు ఇష్టంతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలని అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, సర్పంచ్ తెల్లం కృష్ణవేణి, ఉప సర్పంచ్ నాగమణి, ఉపాధ్యాయుడు ఎజె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రసవత్తరంగా క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

**బూర్గంపాడు:** బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 15వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతుంది. శుక్రవారం జరిగిన తొలిమ్యాచ్‌లో ముల్కలపల్లి ఫ్రెండ్స్ ఎలెవన్ జట్టుపై పాల్వంచ ఛేజింగ్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సంజీవరెడ్డిపాలెం ఎలెవన్ జట్టుపై పాల్వంచ శ్రీరామ్ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో మణుగూరు ఆర్‌కే ఎలెవన్ జట్టుపై పాల్వంచ ధోని ఎలెవన్ జట్టు విజయం సాధించింది. నాల్గో మ్యాచ్‌లో కొత్తగూడెం నాయక్ ఎలెవన్ జట్టుపై చంద్రుగొండ ఫ్రెండ్స్ ఎలెవన్ విజయం సాధించింది. ఆయా మ్యాచ్‌లలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును నిర్వహక కమిటీ ప్రతినిధులు అందజేశారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



అశ్వారావుపేటరూరల్: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



భద్రాచలం: బహుమతుల అందజేత..

**భద్రాచలం:** సంక్రాంతి సందర్భంగా భద్రాచలం పట్టణ మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదర్శ నగర్ కాలనీలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు సరెళ్ల నరేష్, నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డిలు బహుమతులను అందచేసి అభినందించారు. పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షుడు వసంతాల రాజేశ్వరి, తుమ్మల రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి తెల్లం నరేష్, భూక్యా రంగా, వెంకటేష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు రాసమల్ల రాము, నిట్ట రాజు, కళ్యాణి, దేవకి, నీరజ, జగ్గకుమారి, విజయ,రూప, నాగమణి పాల్గొన్నారు.

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం గ్రామంలోని కళాశాలలో ఎన్‌యస్‌యస్ ఆధ్వర్యంలో,రా మచంద్రునిపేటలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందచేశారు. ప్రిన్సిపల్ యల్.వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.శ్రీనివాసరావు, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన, సాయన్న, శంకర్, వార్డు సభ్యులు కల్లూరి చంద్రమ్మ, నరసమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక వీకేడీవీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శేషుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని నందిపాడు గ్రామంలో శుక్రవారం పీవైఎల్, పీవోడబ్ల్యూ రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కమిటీ నాయకులు గోగినపల్లి ప్రభాకర్ బహుమతులు పంపిణీ చేశారు. కంగాల కల్లయ్య, వాసం బుచ్చిరాజు, కారం మల్లేష్, లక్ష్మణ్‌రావు, అర్జున్ పాల్గొన్నారు.

**భద్రాచలంటౌన్:** పట్టణంలోని ఏఎంసీ కాలనీలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను వైభవంగా నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అశ్వారావుపేటరూరల్: బహుమతులు అందజేస్తున్న నాయకులు



భద్రాచలంటౌన్: విజేతలతో నిర్వాహకులు



దుమ్ముగూడెం: ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో..

## బహిరంగ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

**మణుగూరు రూరల్ :** ఈ నెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగబోయే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభతో దేశ రాజకీయాలలో నూతన శకం ఆరంభం కానుందన్నారు.

**కంటి వెలుగును విజయవంతం చేయాలి**

కంటి వెలుగు పథకం రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు కోరారు. శుక్రవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివకుమార్, నేత్ర వైద్యాధికారి సంజీవరావులు రేగా కాంతారావును కలిసి ఈ నెల 18 నుండి నిర్వహించబోయే కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరుతూ ఆహ్వానించారు. అనంతరం కంటివెలుగు కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**క్యాలెండర్ల ఆవిష్కరణ..**

పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం–2023 క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమితిసింగారంలో గల పద్మశాలి భవన్‌లో ఆవిష్కరించారు. పద్మశాలి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక క్యాంప్ కార్యాలయం, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో బీఆర్‌ఎస్ పార్టీ కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఆర్ కప్–2023 నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు.

**బ్రిడ్జి పనుల పరిశీలన..**

**కరకగూడెం:** మండలంలోని మోతె గ్రామంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అధిక నిధులు కేటాయిస్తున్నారన్నారు.

## పోలీసు రాత పరీక్షలకు ప్రత్యేక శిక్షణ



సాయం అందజేస్తున్న ఉద్యోగులు

**మణుగూరుటౌన్:** పోలీసు రాత పరీక్షలకు సింగరేణి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రిసర ప్రాంతాల పిల్లలకు సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లల యువతీ యువకులకు 130 మందికి శిక్షణ ఇవ్వగా వారిలో 52మంది దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారన్నారు. శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు కోరడం జరుగుతుందని, స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**కార్మికుడికి వితరణ**

కాంట్రాక్ట్ కార్మికుడు గోపయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం అధికారులు, మినిస్టీరియల్ స్టాఫ్ అందరూ తమ వంతుగా రూ.77,970లు ఆర్థిక సాయం అందించారు. టీబీజీకేఎస్ యూనియన్ తరుపున రూ.5 వేలు, ఓసీ–2 వారు రూ.2 వేలు, బేసువర్క్‌షాపు నుంచి రూ.5 వేలు, జీఎం కార్యాలయం, ఎస్వోటూ జీఎంలు రూ.5వేలు ఆర్థిక సాయంతోపాటు నిత్యావసర వస్తువులు గోపయ్యకు అందించారు. సింగరేణి సంస్థ క్యాలండర్ సంస్థ తయారు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా ఏజీఎం సివిల్ డి.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, డీజీఎం ఐఈడీ వెంకట్రావ్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, డీజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి, సీనియర్ సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్, టీబీజీకెస్ నాయకుడు వి.ప్రబాకర్‌రావు, సీనియర్ అకౌంట్స్ అధికారి రమేష్, పీఏ జీఎం రాంబాబు, క్లరికల్ సిబ్బంది సీతా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారి

**కరకగూడెం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతన వైద్యాధికారిగా కారం మధు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన డాక్టర్ పర్షియా నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పినపాక వైద్యుడిగా సేవలందిస్తున్న కారం మధు కరకగూడెంలో నూతనంగా విధులు నిర్వహించనున్నారు.

### సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాలు



సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

**ములకలపల్లి :** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పొగళ్లపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పొగళ్లపల్లిలో శుక్రవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అక్షరాభాస్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, ఏఎన్‌ఎం ఈశ్వరి, వార్డు సభ్యురాలు వెంకటనర్సమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

### 'బ్రిలియంట్'లో సంక్రాంతి




**బూర్గంపాడు:** సారపాకలోని బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబురాలను నిర్వహించారు. బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు, స్వర్ణకుమారి దంపతులు భోగిమంటలు వెలిగించి సంక్రాంతి సంబురాలను ప్రారంభించారు. విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దుల వేషధారణలో, బొమ్మల కొలువులో సందడి చేశారు. ఈ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

### ఏజెన్సీలో గిరిజనేతరులపై వివక్ష

**చండుగొండ:** ఏజెన్సీలో ఉన్న గిరిజనేతరులపై టీఆర్‌ఎస్ ప్రభుత్వం వివక్ష చూపుతుందని ఏజెన్సీ దళితుల సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నడ్డి రవికుమార్ విమర్శించారు. తిప్పనపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను విస్మరించిన టీఆర్‌ఎస్‌ను ఈసారి ఎన్నికల్లో ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అటెన్షన్ ప్లీజ్



## గోతిని పూడ్చేదెన్నడో..?



మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న తారు రోడ్డు ఉంది. దీనికి అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా ధ్వంసమై, అడుగున్నర లోతులో పెద్ద గోతిని తలపిస్తోంది. ఈ రోడ్డుగుండా చిన్నగొల్లగూడెం, పెద్దగొల్లగూడెం, నల్లకుంట గ్రామాల ప్రజలు ఎక్కువగా వ్యవసాయ, తదితర పనుల నిమిత్తం ప్రయాణిస్తుంటారు. రాత్రి ప్రయాణించే వారికి ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ వల్ల ముందు కనపడకపోతే గోతిలో పడే ప్రమాదం ఉంది. రెండు భారీ వాహనాలు ఒక్కసారే ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో అవి వాటి మార్గాల్లో ప్రయాణించడం చాలా కష్టతరంగా ఉంటుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డును బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు. - దమ్మపేట

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 8309162728

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎ. దుర్గాప్రసాద్ - 79979 58226 | టోల్ ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు
టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416